## చిట్టి పిన్ని - by SKU



చిట్టి పిన్ని అంటే, మా అత్త కూతురు. అత్త కూతురు పిన్ని.. వరుస ఎలా కలిసింది అని అనుకుంటున్నారా? మా అమ్మగారూ, నాన్నగారూ దగ్గర బంధువులు కావటం వలన మాకున్న ప్రతీ చుట్టానికీ మాకు రెండేసి వరసలు వుంటాయి. ఏ వరస అయినా, మా పిన్నీ, వాళ్ళ అప్పచెల్లెళ్ళూ అంతా మా అమ్మగారిని "అక్క" అని పిలిచేవారు. కనుక అత్త కూతురు మాకు పిన్ని అయింది!

చిట్టి పిన్ని చిట్టితనం అంతా పేరుకి మాత్రమే పరిమితం. చూడటానికి ఆరు అడుగుల పైన వుంటుంది. మాకు ఎంత మంది చుట్టాలు వున్నా ఎందుకో నాకు మా అమ్మగారు తరువాత అంత ఆత్మీయత మా చిట్టి పిన్ని లోనే చూసాను. నేను 3 లేక 4 చదువుతుండగా మా స్కూల్ లో టీచర్ గా పని చేయటానికి కాకినాడ వచ్చింది చిట్టి పిన్ని. ఆ వచ్చినప్పుడు ఊళ్ళో ఎంత మంది చుట్టాలు వున్నా, ఎవరి దగ్గరా వుండటానికి ఇష్టపడక, తనొక్కతీ ఒక మేడ మీద గది (మా ఇంటికి పక్క వీధిలో, మా పెదనాన్నగారి ఇంటికి ఎదురుగా) తీసుకొని అందులో అద్దెకి వుండేది.

మేము స్కూల్ కి వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ ఆ మేడ దగ్గరకి రాగానే ఒకసారి తలెత్తి చూసేవాళ్ళం. ఆ ఇంటిదాకా ఏమిటి లెండి.. అసలు ఆ వీధి లోకి తిరుగుతూనే, ఆ మేడ పైకి చూసేవాళ్ళం.. పిన్ని కనిపిస్తుందేమో అని. పనిలో వుంటే ఏమో కానీ, సాధారణం గా తను కూడా మాకు ఏమైనా కబురు చెప్పాలంటే మేము వచ్చే సమయానికి పిట్టగోడ దగ్గరకి వచ్చి, మా కోసం చూస్తూ వుండేది.

ఎందుకో, నాకు గాడిదలు అంటే భయం. కుక్కని చూసి భయపడేవాళ్ళు పరిగెత్తకూడదు అంటారు! (ఈ నగ్న సత్యం నేను రెండు సార్లు కుక్క చేత తరిమించుకున్నాక కానీ తెలుసుకోలేకపోయాను!) అలాగే గాడిదని చూసి కూడా పరిగెత్తకూడదు. వాటికి ఎక్కడ లేని లవ్వూ వచ్చేస్తుంది మన మీద.. మనం దాని నుంచి పారిపోతే! మధ్యలో గాడిద గొడవ ఏమిటా అనుకుంటున్నారా? ఏం లేదు, మా చిట్టి పిన్ని ఉండే వీధిలో బోలెడన్ని గాడిదలు వుండేవి. మా ఇంటి చుట్టు ప్రక్కల బట్టలు ఉతికేవాళ్ళు ఎక్కువ. వాళ్ళంతా గాడిదలు పెంచుకునే వాళ్ళు. అదేం ఖర్మో మరి! నేను ఎప్పుడు ఒక్కదాన్నీ ఆ పిధి వెంబడి వచ్చినా, ఎదో ఒక గాడిద నా కోసమే ఎదురు చూస్తూ వుండేది. దానిని చూసి, ఇంకే ముందీ నేను P.T. ఉష లా పరిగెత్తేదాన్ని. అది నా వెనకే నన్ను అందుకోవటానికి ఆశ్వనీ నాచప్ప లా వచ్చేది. ఈ పరుగులాటలో మధ్యలో తల పైకెత్తి చూడటం మర్చిపోయేదాన్ని కాదు. చిట్టి పిన్ని మేడ మీద కనిపిస్తే, ఎదో ఒక సలహా చెప్పేది. లేకపోతే, ఆనాటి ద్రౌపదిని ఆదుకున్న శ్రీకృష్ణ భగవానుని లా (స్వారీ.. సెక్సులు మారిపోయాయి!) రక్షించేది. అంటే, గబగబా వచ్చి ఆ గాడిదని అదిలించటమో, లేక నన్ను గబుక్కున వాళ్ళ మెట్లు ఎక్కి పైకి వచ్చేయమనో చెప్పేది.

తరువాత, మా చిట్టి పిన్ని పెళ్ళి అయి, హైదరాబాదు సెక్రటేరియట్ లో వుద్యోగం వచ్చి వెళ్ళిపోయింది. నాకు బాబయ్యగారు కూడా చాలా ఇష్టం. మాకు సెలవులు, నాన్నగారి పనులూ ఎక్కువ కనుక మేము సాధారణం గా ఊర్లు తిరిగటం చాలా తక్కువ. పిన్నిని కలిస్తే ఎవరిదైనా పెళ్ళి లో కానీ, పేరంటం లో కానీ. నన్ను, ఆ మాట కొస్తే మా అర టికెట్టు బాచ్ లో ఎవరిని చూసినా "ఏంట్రా? సూరిగాడూ?" అనో.. "సుజాతా! ఎంట్రా? ఎలా వున్నావ్?" అనో తనదైన style లో పలకరించేది. తన కంఠం కంచు కంఠం. కనుక ఎంత వంద మంది లో వున్నా, తను మనని ఆ ప్రశ్న వేసిందంటే కొంచెం సిగ్గు పడేవాళ్ళం జవాబు ఇవ్వటానికి.

ఇలా కలిసిన సందర్భాలలో ఎప్పుడూ మా నాన్నగారి దగ్గరా, అమ్మ దగ్గరా నిష్టూరాలు పోయేది "మా హైదరాబాదు ఎప్పుడూ రారు.. అవునులే నాన్నా! మీరెందుకు వస్తారు?" అని.

మా నాన్నగారూ తక్కువ తినలేదు. ఆయన వెంటనే చెప్పేవాళ్ళు. "నువ్వెళ్ళి ఎక్కడో చార్మినార్ లో వున్నావు. అక్కడకి రావాలంటే మాకు భయం బాబూ!" అని.

చిట్టి పిన్ని చార్మినార్ దాటి లోపలికి వున్న చందూలాల్ బరాదరీ లో వుండేది. తన పెళ్ళి అయినప్పటి నుండీ వాళ్ళ కాపురం అక్కడే. మరి పేపర్లలోనూ TV లోనూ ఎప్పుడూ చార్మినార్ దగ్గర కత్తి పోట్లు అనీ, మత సంఘర్షణలు అనీ వార్తలు వస్తూ వుంటాయి. పిన్ని ఎక్కడ వున్నా, అందరి లోనూ కలిసిపోతుంది. బాబయ్యగారు కూడా అంతే. ఎవరికైనా పెళ్ళి సాయం చేసే తత్వం. అటువంటి వారిని ఏ మత సంఘర్షణా ఏమీ చేయలేదు. తమ చుట్టూ వుండే ముస్లిం కుటుంబాలే తమకి రక్ష అనీ, అసలు వాళ్ళకే మనిషిని ఎలా గౌరవించాలో బాగా తెలుసు అనీ అనేది.

నాకు హైదరాబాదు లో వుద్యోగం వచ్చినప్పుడు నాన్నగారు సందేహించారు నన్ను ఎక్కడ వుంచాలి అని. ఆయనకి

సందేహం వున్నా, నాకు అలాంటి భయం లేదు. ఎదో ఒక hostel లో వుంటాను అని ఆయనకి ధైర్యం చెప్పేదాన్ని. కానీ ఆయన భయమే గెల్చి, నేను చిట్టి పిన్ని వాళ్ళింట్లో దిగాను. వాళ్ళు వుండేది రెండు గదుల ఇంట్లో. ఎదో బీరకాయ పీచు అని చిట్టి పిన్నీ అనుకోలేదు, భార్య పుట్టింటి చుట్టం మనకెందుకీ తంట అని బాబయ్యగారూ అనుకోలేదు. వాళ్ళింట్లో వుండి వాళ్ళకి ఇబ్బంది అని నేను మొహమాటపడ్డాను కానీ వాళ్ళేనాడూ అలా అనుకోలేదు. కానీ, ఆ వుద్యోగం నేను వెలగబెట్టింది ఒక నెల రోజుల పాటే. కెనడా రావల్సి వచ్చి, వుద్యోగం రిజైన్ చేసి మరోసారి కాకినాడ చేరుకున్నాను.

కెనడా వచ్చేసి 3 సంవత్సరాలకి ఇండియా వెళ్ళాను. నాన్నగారు చెప్పారు "బాబయ్యగారికి సిటీ బస్సు ఎక్కుతూ జారిపడ్డారు.. కాలి మీదనుంచి సిటీ బస్సు టైరు వెళ్ళిపోయి, కాలు ఆపరేషన్ చెయ్యాల్సి వచ్చింది. కాంపన్సేషన్ కోసం పాపం చాలా తిప్పిస్తున్నారుట!"

వీలుచూసుకొని పిన్నినీ, బాబయ్యగారినీ కలవటానికి వెళ్ళాను. ప్రస్తుతం పిన్ని హైదరాబాదు లో ఇల్లు కట్టుకొంది. ఒకబ్బాయి హైదరాబాదు లో మెడిసిన్ చేస్తున్నాడు, రెండో అబ్బాయి ఇంజనీరింగ్ ప్రయత్నిస్తున్నాడు. బాబయ్యగారిలో కానీ, పిన్ని లో కానీ అదే ధైర్యం, అదే ఆప్యాయత! అదే పిలుపు "ఏంట్రా సూరిగాడూ! ఎలా వుండేదానివి ఎలా అయిపోయావే!?" అని!

అంటే, మరేం లేదు లెండి.. నేను ఇండియా తిరిగి వెళ్ళే టైమ్ కి వేషం పూర్తిగా మార్చేసాను. అదివరకు వుండే టిమిడ్ లుక్ పోవటానికి అన్నట్టు జుట్టు కత్తిరించేసి, నా ప్రవర్తన కూడా ఎంతో మార్చుకున్నాను.. కాలం తో నెగ్గుకురావాలంటే మనమూ మారాలి అన్నట్టు! (అది నా రీజనింగ్ లెండి!)

పిన్ని మాత్రం.. లేశ మాత్రం మారలేదు. అదే నిరంతర యుద్ధం! అంత పెద్ద పట్టణం లో ఒక మామూలు మధ్య తరగతి గృహిణి. కానీ, తన కొడుకులని ఏ స్థాయికి తీసుకురావాలనుకుందో ఆ స్థాయి కి తీసుకువచ్చింది. బాబయ్య గారి అనారోగ్యం, ఇతర ఇబ్బందులూ ఎదురయినా, ధైర్యం గా ముందుకి వెళ్ళింది. మా అమ్మ గారు ఎప్పుడూ అనేవారు.. ఆడపిల్ల అంటే అలా వుండాలి.. అయ్యో దేవుడా.. నాయనా అంటూ తన అదృష్టం ఇలా వుందేమిటా అని కంప్లైంట్ చెయ్యచ్చు.. లేదా పరిస్థితులని తన చేతిలోకి తీసుకొని, వాటిని బాగు పరచుకోవటానికి ప్రయత్నించచ్చు. ఆ రెండో పని చేసింది, తన ధైర్యం కోల్పోకుండా అలా ముందుకు వెళ్తోంది కనుక అదంటే నాకు చాలా ఇష్టం, గౌరవం అని ఒకానొక ఎమోషనల్ పరిస్థితి లో చెప్పారు.

నాకు కూడా చిట్టి పిన్ని అంటే అమ్మ తరువాత అమ్మ అంత గౌరవం. తన లో ఏమిటంత ప్రత్యేకత చిట్టి పిన్ని లో అని ఆలోచిస్తే, మా ఇంట్లో మొదట వుద్యోగం చేసిన అమ్మాయి తనే. ఈ రోజుల్లో వుద్యోగం చేయటం గొప్ప ఏమీ కాదు. కానీ, హైదరాబాదు పట్టణం లో, తను బాబయ్య గారూ ఇద్దరూ చిన్న రెండు గదుల ఇంట్లో దాదాపు 20 ఏళ్ళ క్రితం సంసారం మొదలెట్టి అప్పటి నుండీ ఒకటే లక్ష్యం తో ముందుకు సాగారు. పిల్లలని చదివించాలనుకున్న చదువులు చదివించారు. పిల్లలు కూడా చూసారు తమ తలితండ్రులు ఎంత కష్టపడుతున్నారో తమ కోసం అన్నది. ఆ బాధ్యత పిల్లలలో కలగాలి అంటే తలి తండ్రుల బాధ్యత ఎంతో వుంది. అలాగని ఏనాడు పిన్ని కానీ బాబయ్య గారు కానీ వాళ్ళు ఏదన్నా అడిగితే తమ ఆర్థిక ఇబ్బందులు చూపించి కాదనలేదు, లేదనలేదు. తనకి వచ్చే జీతానికి ఇంకా మంచి ఇంటికి మారగలిగే స్థోమత వున్నా, తమ పిల్లల భవిష్యత్తు దృష్టి లో పెట్టుకొని, ఒక ప్లానింగ్ తో ముందుకి వెళ్ళారు.

పిన్నిని చూస్తే, ఎంతో ముచ్చట వేస్తుంది. నగలూ, ఖరీదైన చీరలూ ప్రతీ ఆడపిల్లకీ వుండే కోరికలే. అలాగని తన జీతం వాటి కోసం ఖర్చుపెట్టకుండా, తన ఈ రోజు సంతోషం కన్నా తన పిల్ల సంతోషం దృష్టి లో పెట్టుకొని ముందుకి కదిలింది. ఇవాళ పిల్లలు పెద్ద చదువులు చదివి, వృద్ధి లోకి వస్తే దాని వెనుక ఎవరిదో ఒకరి త్యాగం, పట్టుదల, ప్రోత్సాహం వుంటుంది. పిన్ని పిల్లల విషయం లో మాత్రం అది పిన్ని నుండే వచ్చింది అంటే సందేహం లేదు.

నేను హైదరాబాదు లో వాళ్ళ ఇంట్లో వున్న కొద్ది పాటి రోజులూ ఒక రివీలేషన్ నాకు. కలివిడి తనం అంటే ఏమిటో, మాట చొరవ అంటే ఏమిటో అక్కడ వున్న రోజుల్లో అర్థం అయింది. ఆటో లో కూర్చుంటే.. ఇల్లు చేరే లోపల ఆటో అబ్బాయి చేత "దీదీ" అనో.. లేకపోతే తనే ఆ అబ్బాయిని "భయ్యా" అనో వరస కలిపేసేంత చొరవ తనకీ, బాబయ్య గారికీ ఇద్దరికీ! ధైర్యమే కాదు, చొరవ కూడా పిన్ని దగ్గర చూసి నేర్చుకోవాలి అనుకున్నాను అప్పుడే. కానీ అదీ ఒక అదృష్టం ఆ కలివిడితనం అందరిలోనూ వుండదు! "నోరు మంచిది అయితే ఊరు మంచిది అవుతుంది" అనే సామెత అర్థం పిన్నిని చూస్తే తెలిసింది.

మీ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు రచయిత్రి SKU కి తెలియపరచండి.